ప్రజాశక్తి

సోమవారం 27 మార్చి 2023

5

పార్వతీపురం మన్యం

నేడు 104 వాహనాలు ప్రారంభం

ప్రజాశక్తి -సాలూరు

ఫ్యామిలీ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాకు మంజూరైన 104వాహనాలను సోమవారం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ప్రారంభించనున్నారు. జిల్లాకు కొత్తగా 11వాహనాలు మంజూరయ్యాయి. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి రాజన్నదొర స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న విఆర్‌ఎస్ క్వార్టర్స్ ఆవరణలో వాహనాలను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని 104 నోడల్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా మేనేజర్ దుర్గా ప్రసాద్ పర్యవేక్షణ చేస్తారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు చెప్పారు.

రెవెన్యూ మాయాజాలం

- ఆన్‌లైన్‌లో విఆర్‌ఎస్ ముంపు భూములు
- క్రయవిక్రయాలు చేయడానికి ప్రయత్నాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

విఆర్‌ఎస్ ముంపు భూములు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మాయాజాలం నడుస్తోంది. ఎప్పుడు ఎవరి భూములు వెబ్ ల్యాండ్‌లో ఉంటాయో ఎవరి భూములు తొలగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వెబ్ ల్యాండ్‌లో ఉండాల్సిన సర్వే నెంబర్లు అప్పుడప్పుడు మాయమవుతున్నాయి. ఉండ కూడని సర్వే నెంబర్లు దర్శనమిస్తున్నాయి. దీనంతటికీ కారణం ఏమిటంటే రెవెన్యూ అధికారులు, సిబ్బంది చేతివాటం కారణంగానే మాయాజాలం నడుస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని దత్తివలస రెవెన్యూ పరిధిలో గల విఆర్‌ఎస్ ముంపు భూముల పరిస్థితి అలాగే ఉంది. 1984లో విఆర్‌ఎస్ బ్యాక్ వాటర్ ముంపు వల్ల దత్తివలస రెవెన్యూ పరిధిలో ఉన్న 22ఎకరాల భూములు ముంపునకు గురయ్యాయి. ఈ భూములకు ప్రభుత్వం నష్టపరిహారం కూడా చెల్లించింది. ప్రభుత్వం పరిహారం చెల్లించిందటే ఆ భూమి ప్రభుత్వానిదనే అర్థం. అయితే కొద్దిరోజులుగా ఈ భూముల్లో కొన్ని వెబ్‌ల్యాండ్‌లో దర్శనమిస్తున్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు ఆ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడానికి సిద్ధమవుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ముంపు భూములకు పరిహారం పొందిన రైతుల్లో కొంతమంది వారసుల పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయమై గతంలో తహశీల్దార్ కొట్నాన శ్రీనివాసరావుకు కొంతమంది రైతులు ఫిర్యాదు కూడా చేశారు. ముంపు భూములను వెబ్ ల్యాండ్‌లో చూపించడంపై ఫిర్యాదు చేశారు. అప్పుడు వెంటనే తహశీల్దార్ శ్రీనివాసరావు ఆ భూములను రెడ్ మార్క్‌తో వెబ్ ల్యాండ్‌లో చూపినట్లు తెలుస్తోంది. అయితే గత కొంతకాలంగా మళ్లీ ఆ భూములు వెబ్ ల్యాండ్‌లో కనిపిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఆ భూములకు సంబంధించిన రైతుల పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయడమే కాకుండా క్రయవిక్రయాలకూ ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా మండల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మిగిలిన రైతులు కోరుతున్నారు.

ఏజెన్సీ గొంతెండుతోంది

సీతంపేట ఏజెన్సీలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో బావుల్లో నీరు ఊరడం లేదు. బోర్ల నీరందక ఎంత కొట్టినా నీరు పడకపోవడంతో గిరిజనులు ఊట బావుల వైపు పరుగులు తీస్తున్నారు. అవి కూడా ఎండిపోవడంతో తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను ముందస్తుగానే అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అడుగంటిన బావులు, బోర్లు
- గుక్కెడు నీటి కోసం తహతహ లాడుతున్న గిరిజనం

ప్రజాశక్తి - సీతంపేట

వేసవి ప్రారంభంలోనే ఏజెన్సీని తాగునీటి సమస్య వెంటాడుతోంది. ఏజెన్సీలో 475 గిరిజన గ్రామాలున్నాయి. వీటిలో 160 సోలార్ పథకాలకు 140 పని చేస్తున్నాయి. 401 బావులకు ఒకటో రెండు తప్ప మిగతావన్నీ పనిచేస్తున్నాయని, 704 బోర్లు కు 35 మాత్రమే నీరు తగ్గిందని, 82 రక్షిత మంచినీటి పథకాలకు 82 పనిచేస్తున్నాయని. 140 గ్రావిటేషన్ స్లో కు 140 పని చేస్తున్నాయని అధికార గణాంకాలు చెప్తున్నాయి. అయితే ఈ గణాంకాలు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పూర్తిగా భిన్నంగా ఉందని బాధిత గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కడగండి పంచాయతీ ఒంద్రుజోలలో 78 కుటుంబాలు జీవన సాగిస్తున్నాయి. ఉన్న ఒక్క బావి అడుగంటి పోయింది. దీంతో ఐదు కిలోమీటర్ల దూరంలో ఆటోల ద్వారా డ్రమ్ములతో నీరు తెచ్చుకొనే పరిస్థితి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ధారపాడు పంచాయతీ దబరలో 34 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామంలో బావుల్లేవు, ఉన్న ఒక బోరును ఎంత కొట్టినా నీటి చుక్క పడడం లేదు. అర కిలోమీటరు దూరానున్న ఊటబావికి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఏప్రిల్ నెలాఖరు, మేలో ఈ ఊట బావి కూడా అడుగంటి పోతుంది. తుంబకొండ పంచాయతీ తుంబకొండలో 70 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామంలో బోర్లు లేవు. రెండు బావులున్నప్పటికీ ఒకటి పూర్తిగా పాడైపోయింది. రెండో బావి వేసవి ఆరంభంలోనే అడుగంటి పోయింది. దీంతో ఊటబావి నీరే గతి అవుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సందిగూడలో 25 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ బోర్లు, బావులు లేవు. ఊట బావి ద్వారా సొంతంగా పైప్ లైన్ వేసుకొని నీరు తెచ్చుకుంటున్నారు. అది కూడా చాలడం లేదు. పివి ఈతమానుగూడ పంచాయతీ నెల్లిగండిలో 16 కుటుంబాలున్నాయి. ఇక్కడ బోరు లేదు ఉన్న ఒక బావిలో నీరు తగ్గింది . గ్రావిటేషన్ ఫ్లో ద్వారా నీరు చాలడం లేదని తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరారు. దిగువ దుంబంగివలసలో 18కుటుంబాలు ఉండగా, ఇక్కడ కూడా బోర్లు, బావులు లేవు. గ్రావిటేషన్ల ద్వారా నీరే ఆధారం. ప్రస్తుతం వేసవి కావడంతో నీరు చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటోల ద్వారా నీళ్లు తెచ్చుంటున్న ఒంద్రోజోల గిరిజనులు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మాగ్రామంలో బోర్లు లేవు. బావి అడుగంటిపోయింది. రక్షితమంచినీటి పథకం ద్వారా వస్తున్న నీరు చాలడంలేదు. కావున అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలి

మండంగి ధర్మారావు,
తుంబకొండ.

ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలి

గిరిజన తండాల్లో సర్వే చేపట్టి నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన ట్యాంకర్ల ద్వారా నీరందించాలి. శాశ్వత పరిష్కారం చూపాలి.

ఆరిక భాస్కరరావు
సిపిఎం మండల కార్యదర్శి, సీతంపేట

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

ఇప్పటికే సిబ్బంది ద్వారా సర్వే చేపట్టి 20 గ్రామాల్లో నీటి సమస్య ఉందని గుర్తించాం. ఈ గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరందించడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. బోర్లు ఇప్పటికే మరమ్మతులు చేయించాం.

పవన్ కుమార్,
జెఇ, ఆర్‌డబ్ల్యుఎస్.

మెట్టవీధిలో దాహం కేకలు

ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మెట్టవీధివాసులు

బలిజిపేట : స్థానిక మెట్టవీధి వాసులు సిపిఎం నాయకలు ఎం.మన్మథరావు సమక్షంలో తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నెల రోజుల నుంచి తాగడానికి నీళ్ల లేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్‌కి చెప్పినా ఫలితం లేదని, ఇంటింటికి కొళాయిలు వేసిన దిష్టిబొమ్మలాగా కనిపిస్తున్నయి తప్ప చుక్క నీరు రావడంలేదని అన్నారు. మెట్ట వీధి కాలనీ వాసులు స్కూల్‌కు వెళ్లి నీళ్ల తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని, కావున తాగడానికి ట్యాంకర్ ద్వారా నీళ్ల సరఫరా చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. మూడు రోజుల్లో నీళ్ల ఇవ్వకపోతే సంబంధిత కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రజలు హెచ్చరించారు. అలాగే పలగర, గుడివాడ కాలనీల్లోనూ నెలరోజులుగా తాగడానికి నీళ్ల లేవన్నారు. కార్యక్రమంలో ఆశ్రియా లక్ష్మణరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాలకొండలో 2కె వాక్ చేస్తున్న ఉపాధ్యాయులు

సిపిఎస్ రద్దుకు 2కెవాక్

ప్రజాశక్తి - పాలకొండ

సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో దుర్గగుడి జంక్షన్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు 2కె వాక్ ఆదివారం నిర్వహించారు. ఈ వాక్‌ను యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి- పాతపెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేస్తారా- గద్దె దిగుతారా అని నినదించారు. ఈ 2కె వాక్‌లో యుటిఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్లు బి.విజయకుమార్, వి.జ్యోతి, కె.మురళీ, ఎ.భాస్కరరావు, కె.క్రిష్ణారావు, కె.గోవిందమ్మ, ఎం.పైడిరాజు, కె.భాస్కరరావు, దండు ప్రకాశరావు, సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎం.శంకరరావు, భామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

11,336 మంది విద్యార్థులు ● 'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ ముఖాముఖి

రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 3నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ తెలిపారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఈ ఏడాది 11,336మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థులు రాకపోకలకు రవాణా సౌకర్యం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వీటితో పాటు టెన్త్ పరీక్షల నిర్వహణకు చేపట్టిన చర్యలు, ఏర్పాట్లను 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

-ప్రజాశక్తి , కలెక్టరేట్

జిల్లాలో ఎన్ని కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు నిర్వహిస్తున్నారు?

జిల్లాలో 10వ తరగతి పరీక్షల కోసం 64 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశాం. 11,336 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ 64 కేంద్రాలకు గానూ 536 మంది ఇన్విజిలేటర్లను నియమించాం.

పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఇప్పటికే పరీక్షలు నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, పరీక్ష గదుల్లోకి వెలుతురు వచ్చేలా విద్యుత్ సౌకర్యం, తాగునీరు, వైద్య సదుపాయానికి కావాల్సిన మందులతో సహా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఎన్ని స్క్వాడ్లు పనిచేయనున్నాయి?

పరీక్షల పర్యవేక్షణకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశాం. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో డిప్యూటీ తహశీల్దార్, ఎస్ఐ, విద్యాశాఖకు సంబంధించిన అధికారులు ఉంటారు. 5 సిట్టింగ్ స్క్వాడ్లను నియమించాం. అలాగే పోలీసు స్టేషన్‌కుదూరంగా ఉన్న 22 పరీక్ష కేంద్రాలకు గానూ 22 సీ స్క్వాడ్లను నియమించాం. వీరితోపాటుగా సహాయకులు కూడా ఉంటారు. స్పెషల్ స్క్వాడ్‌గా రాష్ట్ర పరిశీలకులు డి.మధుసూదనరావు జిల్లాలోని పరీక్షలను పర్యవేక్షిస్తారు.

పరీక్షా సమయంలో విద్యార్థులకు ఏవైనా అసౌకర్యాలుంటే ఎవర్ని సంప్రదించాలి?

విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన ఏమైనా అసౌకర్యాలు కలిగితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించవచ్చు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ సౌకర్యం 24 గంటలు అందుబాటులో ఉంటుంది.

విద్యార్థులకు మీరిచ్చే సలహా ఏమిటి?

టెన్త్ విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. వారి రోల్ నెంబర్‌ను సరిగ్గా చూసుకొని వారికి నిర్దేశించిన సీట్లకు ముందుగానే చేరుకోవడం వల్ల ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయవచ్చు. అలాగే పరీక్ష సమయంలో విద్యార్థులు సమయం వృధా చేయకుండా ప్రతి నిమిషం సద్వినియోగం చేసుకోవాలి. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకొని బాగా చదువుకొని పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలి.

గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

అదానీ-జగన్ రహస్య ఒప్పందంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

దేశ సంపదను అడ్డగోలుగా దోచుకుంటున్న అదానీతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసుకున్న రహస్య ఒప్పందాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని సిపిఎం పార్వతీపురం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. సిపిఎం రాజకీయ ప్రచారంలో భాగంగా ఆదివారం రావికోన, రంగాలగూడ, కొత్తవలసలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దేశానికి మోదాని, అదాని గాలి బుడగ పుస్తకం, పార్టీ కరపత్రం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడీ విధానాలు అదానీ, అంబానీ ఆస్తులు పెట్టుబడులు పెంచేవిగా ఉన్నాయని, ప్రజలపై భారాలు వేసి ప్రభుత్వ రంగం బ్యాంకులు, ఎల్ఐసి, విశాఖ స్టీల్ ప్లాంట్‌లు దోచుకోనివిగా ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు, గిరిజనుల సమస్యలపై చర్చకు సమయంలేదు కానీ, అదానితో 4గంటలు రహస్యంగా చర్చలు చేయడానికి సమయం దొరుకుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి మోడీ పెట్టుబడులు ఇచ్చింది లేదు, అదాని పెట్టింది లేదన్నారు. గంగవరం పోర్టు, విశాఖ స్టీల్ లు, విద్యుత్తు ప్రాజెక్టులు దోచుకు పోవటానికే రహస్య ఒప్పందమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. ప్రచారంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, కార్యదర్శి గంగన్న, సభ్యులు రమేషు తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాహుల్ గాంధీని ఎంపిగా సస్పెండ్ చేయడానికి వ్యతిరేకంగా స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ ఆధ్వర్యాన ఆదివారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి డోల శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత్ జోడో యాత్రకు వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేక, పార్లమెంట్‌లో, బయటా రాహుల్ గాంధీ అడుగుతున్న ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేక మోడీ ప్రభుత్వం కుతంత్రాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. అదానీ, మోడీ మధ్య సంబంధం, అదానీ అక్రమ ఆస్తులపై ప్రశ్నిస్తుండటంతో బిజెపి ప్రభుత్వం తలలు పట్టుకుంటోందని చెప్పారు. అందుకే కేంద్రం దొడ్డి దారిని ఎంచుకుందని విమర్శించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెహమాన్, టి.సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉద్యోగుల సొసైటీ సర్వసభ్య సమావేశం

పూర్వ అధ్యక్షులు వరప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎస్ఇ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం

శ్రీవెంకటేశ్వర ఎపిఇపిడిసిఎల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజనసభ ఆదివారం నగరంలోని దాసన్నపేట రిజిస్టర్ ఆఫీస్ మేడపైన 1104 యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సభలో అధ్యక్షులు పి.రాము నాయుడు.. 2021 22 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ నివేదిక, 2022 - 2023 జమ ఖర్చుల నివేదిక ప్రవేశ ప్రవేశపెట్టగా, సభ్యులంతా ఆమోదించారు. 28 సంవత్సరాలుగా సొసైటీకి సేవలు అందించిన పూర్వపు అధ్యక్షులు డిఆర్ఎస్‌వి ప్రసాద్, సొసైటీ పాత పాలకవర్గానికి ఎస్ఇ పి.నాగేశ్వరరావు, డిఇఇ ఎన్.కృష్ణమూర్తి సన్మానించారు. రిటైర్ అయిన 48 మంది ఉద్యోగులను సన్మానించారు. సొసైటీలో ఉన్న సభ్యులు పిల్లలను విద్యలో ప్రోత్సహించడం కోసం 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ప్రతిభ కనబరిచిన 8 మందికి ప్రతిభా పురస్కారాలు అందించారు. అనంతరం ఎస్ఇ పి.నాగేశ్వరరావు, డిఇఇ ఎన్.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సొసైటీని మరింత అభివృద్ధి పథంలో కొత్త పాలకవర్గం నడిపించాలని కోరారు. సొసైటీ నడపడానికి సర్కిల్, డివిజన్ స్థాయిలో అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పి.రామునాయుడు, కార్యదర్శి బి.కూర్మారావు, ఉపాధ్యక్షులు జి.అప్పలనాయుడు, జాయింట్ సెక్రెటరీ ఎ.రవి, డైరెక్టర్లు ఎన్.పైడి రాజు, ఎస్.మురళీ, కె.రాజశేఖర్, ఎన్.రమణ, జి.అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్‌బ్యాంకు అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు

15నెలల్లో రూ.3.49కోట్ల డిపాజిట్లు పెంపు

అర్బన్ బ్యాంక్ మహాజనసభలో చైర్మన్ జర్జాపు

ప్రజాశక్తి - సాలూరు

పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత 15నెలల్లో బ్యాంక్‌లో రూ.3.49కోట్ల డిపాజిట్లు పెరిగాయని చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు చెప్పారు. ఆదివారం బ్యాంక్ కార్యాలయ ఆవరణలో అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన మహాజనసభలో ఆయన మాట్లాడారు. తాము పగ్గాలు చేపట్టక ముందు బ్యాంక్‌లో రూ.71.8కోట్లు డిపాజిట్లు ఉండేవని చెప్పారు. ప్రస్తుతానికి రూ.75.32కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. చిన్నతరహా వ్యాపారులకు రుణాల మంజూరు పెంచామని చెప్పారు. తమ హయాంలో రూ.5కోట్ల 40లక్షలు రుణాలుగా మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతానికి బ్యాంక్ రూ.27లక్షల లాభాల్లో ఉందన్నారు. ఖాతాదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బ్యాంక్ పురోభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు చెప్పారు. సమావేశంలో బ్యాంక్ కార్యదర్శి బి.వేణుగోపాలరావు, డైరెక్టర్లు కె.వెంకటరావు, పిరిడి మాలతి, అప్పారావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని శాశ్వత లోక్ అదాలత్ (ప్లాపస్)లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణచక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలంపాటు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి హెడ్ క్లర్క్, స్టెనో కం టైపిస్ట్, టైపిస్ట్ కం అసిస్టెంట్ ఒక్కో పోస్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో అటెండర్ కమ్ ఆఫీస్ సబార్డినేట్ - 4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. దరఖాస్తు చేసే విధానం, అర్హతలు, రిజర్వేషన్, ఎంపిక విధానం తదితర వివరాలకు కార్యాలయంలో గానీ, లేదా https://districts.ecourts.gov.in/vizianagaram వెబ్‌సైట్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

రహదారులను సత్వరమే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం

రహదారుల పనులను సత్వరమే పూర్తిచేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటరావు అధికారులను కోరారు. ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రహదారులు ఎక్కడ చూసినా గతుకులమయంగా తయారయ్యాయని చెప్పారు. రోడ్లపై ప్రయాణించడానికి ప్రజలు భయపడే పరిస్థితి ఉందని తెలిపారు. తరచూ ప్రమాదాలు సంభవించడమే అందుకు కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి రహదారులను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, కార్యదర్శి ఎస్ఎస్ రెడ్డి, గొలగాన బంగారు రాజు, గువ్వల రవి, దువ్వ వేణు, దువ్వ అప్పారావు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి సురేష్

క్రీడల్లో ముందుండాలి : ఎంపిపి

జియమ్మ వలస: గిరిజన యువత క్రీడల్లో ముందుండాలని ఎంపిపి బొంగు సురేష్ కోరారు. ఆదివారం మండలంలోని టికె జమ్ములో సర్పంచ్ సుందరరావు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరిగాయి . పోటీలను ప్రారంభించిన ఎంపిపి సురేష్ మాట్లాడుతూ గిరిజన యువకులు, యువత క్రీడల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. క్రీడలు యువతలో స్ఫూర్తిని నింపి స్నేహభావాన్ని పెంపొందించుతాయన్నారు. క్రికెట్ పోటీల్లో 80 టీములు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.15వేలు నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు కార్యక్రమంలో టీకే జమ్మూ పంచాయతీ పరిధిలో గల గిరిజన యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న డిఆర్ఒ

పాలకొండ : అల్లూరి సీతారామరాజు జిల్లా డిఆర్ఒ బలివాడ దయానిధి కుటుంబ సమేతంగా ఆదివారం కోటదుర్గ అమ్మవారిని దర్శించారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ విశిష్టతను ఆలయ అర్చకులు ఆయనకు వివరించారు. తాను ఆర్డిఒగా ఉండే సమయంలో ఈ ప్రాంతంతో మంచి సంబంధాలుండేవి అని అలాగే ఆలయానికి ప్రతి ఏటా రావడం అలవాటని అన్నారు. ఆయన వెంట నగర పంచాయతీ విశ్రాంతి కమిషనర్ లిల్లీ పుష్పనాథం, భామిని ఉపతహశీల్దర్ జె.రమేష్, విఆర్ఒలు పాలవలస రమేష్ తదితరులు ఉన్నారు.



బాధితులకు విరాళం అందజేస్తున్న గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు

బాధిత కుటుంబాలను ఆదుకున్న గిరిజన ఉద్యోగ సంఘం

ప్రజాశక్తి - కొమరాడ

ఇటీవల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని గిరిజన ఉద్యోగ సంఘాల నేతలు హామీ ఇచ్చారు. ఈమేరకు ఆదివారం బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయి అనాధలుగా మారిన పిల్లలను ఆదుకొనేందుకు గిరిజన ఉద్యోగ సంఘంలోని సభ్యులంతా ఏకమై రూ.లక్షా 62 వేలు విరాళాల ద్వారా సేకరించారు. అందులో రూ.లక్షా 30వేలు బాధిత కుటుంబాలకు అందజేశారు. మరో రూ.35వేలు ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులకు సహాయం చేశారు. గిరిజన ఉద్యోగ సంఘ సభ్యులు చేసిన ఈ వితరణకు అంటివలస, అల్లువాడ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. వితరణ అందజేసిన వారిలో ఉద్యోగులు పి.రాజారావు, నీలకంఠ, సీతారాం, లక్ష్మణరావు, నాగేశ్వరరావు, భూపతి దొర, తదితర ఉద్యోగులు ఉన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న నిర్వాహకులు

40 మంది రక్తదానం

పాలకొండ రూరల్ : టిడిపి నాయకులు కీర్తిశేషులు కోలా మూర్తి రెండో వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక రెల్లి వీధిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు పల్లా కొండబాబు, ఏరియా ఆస్పత్రి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ కౌన్సిలర్ తాతారావు మాట్లాడుతూ కోలా మూర్తి రెండో వర్ధంతి సందర్భంగా సుమారు 40మంది వరకు రక్తదానం చేశారన్నారు. ఆపదలో ఉన్నవారికి ఉచితంగా రక్తం అందిస్తామన్నారు. రక్తదానం చేసిన దాతలకు బ్లడ్ బ్యాంక్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. కోలా మూర్తి కుమార్తె అలేఖ్య మాట్లాడుతూ తన తండ్రి రెండో వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా సుమారు 50-60 మంది వరకు రక్తదానం చేయడానికి వచ్చారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

జయకృష్ణ సమక్షంలో టిడిపిలో చేరిన సీదిగూడ గ్రామ గిరిజనులు

సీదిగూడలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'

సీతంపేట: మండలంలోని సీదిగూడలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం జరిగింది. పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆరిక ఆనంద్, సంసోను, బుడ్డయ్య, కూర్మారావు, సురేష్, శంకర్రావు, సూరయ్య, వంశీ మాట్లాడుతూ టిడిపి హయాంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి జరిగిందని, యువతకు ఉపాధి కల్పన కూడా ఉందని తెలిపారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో తమకు ఎలాంటి ఉపాధి లేదన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల అధ్యక్షులు సవరతోట ముఖలింగం, మండల మహిళా అధ్యక్షులు ఆరిక సువర్ణ, వరలక్ష్మి, క్లస్టర్ ఇంచార్జ్ బిడ్డిక సుబ్బారావు, మాజీ సర్పంచ్ బిడ్డిక స్వామినాయుడు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

లక్షలు వృథా.. లక్ష్యానికి చెద

నిరుపయోగంగా జనరేటర్

వృథాగా ఉన్న జనరేటర్

గుమ్మలక్ష్మీపురం : ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా లేని సమయంలో విధులకు ఆటంకం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనరేటర్ వినియోగించకపోవడంతో నిరుపయోగమైంది. ఆరేళ్ల కిందట స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి జనరేటర్ మంజూరు చేశారు.కార్యాలయం శిథిలమవ్వ డంతో కొత్త భవనంలోకి కార్యాలయాన్ని మార్చారు. అయితే నూతన కార్యాలయానికి జనరేటర్‌ను మాత్రం తీసుకెళ్లకుండా వదిలేశారు. నాటి నుంచి నేటి వరకు అది వినియోగంలో లేకపోవడంతో మూలనపడింది. లక్షలాది రూపాయల విలువైన వస్తువులను మూలన విడిచిపెట్టడం పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షలాది రూపాయల విలువైన ప్రజాధనం వినియోగం లోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

ఏప్రిల్ 5న కార్మిక, కర్షకులు తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. మండలంలోని బుడ్డిడిపేట, లక్ష్మీపురం, బూర్జ, పెదబోగిలి, కామన్నదొరవలస, నిడగల్లు తదితర గ్రామాల్లో ఆదివారం సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నాయకత్వంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అదాని, అంబానీ వంటి కార్పొరేటర్ల సేవలో ప్రధాని తేలిమునుగుతున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ విధానాలకు నిరసనగా తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, ఆర్.రమణమూర్తి, జి.వెంకటరమణ, ఈశ్వరరావు, బి.అప్పారావు, బి.నారాయణస్వామి, ఆర్.సత్యనారాయణ, పోలునాయుడు తదితరులు పాల్గొన్నారు

కొమరాడ: చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర పిలుపునిచ్చారు. ఈ మేరకు కొమరాడలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆమె ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల, రైతులు, వ్యవసాయ కార్మికుల, వివిధ వర్గాల ప్రజల సమస్యలను మరింత జటిలం చేస్తుందని విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక ,రైతు ప్రజా వ్యతిరేకంగానూ, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేసేలా ఉన్నాయన్నారు. అలాగే విశాఖ ఉక్కును అతి తక్కువ రేటుకు బడా పెట్టుబడిదారులకు అమ్మే పరిస్థితి ఉందని ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు, రైతులు వ్యవసాయ కూలీలు పెద్దఎత్తు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె.సాంబమూర్తి, ఎ.ఉపేంద్ర, రెడ్డి శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో సైకిళ్లపై ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పార్వతీపురంరూరల్ : ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, గిరిజన హక్కులకు నష్టం చేసే జగన్, మోడీ విధానాలను ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం నాయకులు టి రాము, సింహాచలం పిలుపు నిచ్చారు. మండలంలోని ములగ, లక్ష్మణ దొరవలస, కవిటి భద్రలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొండగొర్రె రాము, ఎస్ఎఫ్ఐ నాయకులు భాస్కరరావు, మహిళా సంఘం నాయకులు రాధమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

ప్రజాశక్తి- రామభద్రపురం మండలంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వాటికి రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, బొబ్బిలి మండల కార్యదర్శి ఎస్.గోపాలం, జనసేన నాయకులు మహంతి ధనుంజయ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మార్కెట్‌కు ఎదురుగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామభద్రపురం మార్కెట్‌కు ఎదురుగా హైవే పక్కన సర్వే నెంబర్ 98-1లో 56సెంట్లు భూమిని రెవెన్యూ అధికారులు అండతో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు రికార్డులను తారుమారు చేసి ఆక్రమించుకున్నారన్నారు. అదే స్థలంలో ఉన్న ప్రభుత్వ భవనాలను తొలగించి నేలను చదును చేసుకొని దురాక్రమణ చేసిన అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ భూమిని అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఆక్రమణ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు

సీతానగరం : ఏప్రిల్ 3 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు మండలంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ జి.సూర్యదేవుడు తెలిపారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలతో పాటు బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జోగింపేటలోని గురుకుల పాఠశాలలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. 517 మంది విద్యార్థులు ఈ కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

మద్దతుధరకు చట్టం చేయాలి

జామి : పంటల మద్దతు ధర చట్టం అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, వ్యవసాయ పంపు సెట్లుకు మీటర్లు పెట్టొద్దంటూ వచ్చే నెల 5తేదీన రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రధం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు బుద్ధరాజు రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం జామి మండలంలోని విజినిగిరి, తానవరం, జామి, భీమసింగి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భ ంగా రాంబాబు మాట్లాడుతూ, రైతు వ్యతిరేక చట్టాల పై దేశ వ్యాప్తంగా చేపట్టిన రైతు పోరాటాలకు తలొగ్గిన బిజెపి ప్రభుత్వం, పంటల మద్దతు ధర చట్టం అమలుకు హామీ ఇచ్చిందని, కానీ అమలకు నోచుకోని నేపథ్యంలో దేశ వ్యాప్తం గా రైతుల చేస్తున్న పోరాటంలో భాగంగా చలో ఢిల్లీ కార్యక్ర మం చేస్తున్నారన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చడం దుర్మార్గం

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి భజన చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి విమర్శించారు. ఆదివారం తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజన్నదొర మంత్రి హోదాలో నియోజకవర్గానికి గానీ, గిరిజనులకు గానీ చేసిందేమీ లేదన్నారు. బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. గిరిజన వ్యతిరేక ప్రభుత్వమని రుజువైందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసినప్పుడు ఒక్క గిరిజన ఎమ్మెల్యే గాని, సంబంధిత మంత్రిగాని నోరు మెదపకపోవడం అన్యాయమని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించడానికి గిరిజనులు సిద్ధంగా ఉన్నారని సంధ్యారాణి చెప్పారు. సమావేశంలో గిరిజన విభాగం జిల్లా అధ్యక్షులు కోట లక్ష్మణరావు, నాయకులు బి.రామన్నదొర, వెంకటి, దొర లక్ష్మణ పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీయార్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు సందడి చేశారు. పార్కులోని అందాలను ఆస్వాదించారు. యువత బోటు షికారు చేశరు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి ఉల్లాసంగా ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. చిన్నారులు చిల్డ్రన్ పార్క్ వద్ద ఆడుకొని కమాండో నెట్ ఎక్కి సరదాగా గడిపారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

ఘనంగా అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం నిర్వహించారు. కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు పాడి సుదర్శనరావు, పోలూరు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కడ్రక కళావతి, కడ్రక వెంకటరావు, ఆరిక జానకి, మంజువాణి, చిన్న పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక టిడిపి కార్యాలయంలో పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కేకు కట్ చేసి పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షులు సవరతోట మొఖలింగం, రాష్ట ఎస్టీ సెల్ కార్యదర్శి చంద్రరావు, మాజీ వైస్ ఎంపిపి ప్రకాష్‌రావు, మాజీ సర్పంచ్ దమయంతి తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్గీయులు కేక్ కట్ చేశారు. రెండో వర్గం వారు మాజీ ఎంపీపీ జివి రమణమూర్తి ఆధ్వర్యంలో వేరేగా కేకు కట్ చేసి అచ్చెన్నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆశావాసులైన బిడ్డికి పద్మావతి, బిడ్డికి తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు .

గుమ్మలక్ష్మీపురంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

జియమ్మవలస : మండల కేంద్రంలో అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు . కార్యక్రమంలో అరకు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, కురుపాం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షులు దాసరి జ్యోతిర్మయి, తోటపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ ఎం.సత్యంనాయుడు, కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు జి.శ్రీరామమూర్తినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు పి.రాంబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు భూమికి పట్టాలివ్వాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ములగ పంచాయతీలో లక్ష్మన్నదొరవలస గిరిజనులు సాగు చేస్తున్న 100 ఎకరాల భూమిని గిరిజనుల పేరు ఆన్లైన్ నిలిపివేయడం అన్యాయం అని, ఆ భూమిని అక్షయ గోల్డ్ సంస్థ కాజేయాలని చూస్తుందని, దీన్ని ప్రభుత్వం అడ్డుకొని ఆన్లైన్ సర్వే చేసి పాసుబుక్‌లు గిరిజనులకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు జి.సింహాచలం, కె.శ్రీరాములు, పి.రాము, మర్రి బానమ్మ, నారాయణమ్మ, మండంగి త్రినాధ డిమాండ్ చేశారు. ఆదివారం లక్ష్మన్నదొరవలసలో చేపట్టిన రాజకీయ ప్రచారం, పర్యటనలో భాగంగా గిరిజనులు సాగులో ఉన్న భూమిని పరిశీలించారు. అనంతరం సాగుభూమిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్వే నెంబరు 27-1ఎలో సుమారు 58 ఎకరాలు డి.పట్టా భూమి, సర్వే నెంబరు 27 -1సి, 2 బి,4,5లో 52ఎకరాలు జిరాయితి భూమిని ఆన్లైన్ చేసి ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత 3,4 నెలలుగా అధికారులు తహశీల్దార్, జిల్లా అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. లేనిచో కలెక్టర్ ఆఫీసులో ధర్నా ఆందోళన, పోరాటాలు చేస్తున్నామని, ఆ భూమి వద్ద జరిగిన నిరసనలో తెలిపారు. ములగలో కొంతమంది రైతులు పేరుతో అక్షయగోల్డ్‌కు భూములు అన్నారని, వారు తప్పుడు కేసు వేస్తే దాన్ని జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా గిరిజనులకు అన్యాయం చేయడం నేరంగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గిరిజన, రైతులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్ద పీట :ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. మండలంలోని జమదాల సచివాలయం జమ్మిడివలసలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకొని వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను తెలిపే బుక్లెట్‌లను అందజేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం భాగ్యశ్రీ, ఆత్మ చైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, బి.కృష్ణమూర్తి, యాళ్ల ప్రతాప్, కె.సత్యనారాయణ, వి.గురురాజు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, సహాయ కార్యదర్శి టి.జీవ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించిన కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలవరానికి నిధుల మంజూరుపై కేంద్రం పదేపదే అన్యాయం చేస్తున్నాప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోరుమెదపకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. అలాగే జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. ఈనెల 27న స్థానిక కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఐ నాయకులు జి.సూరయ్య, ఈవి నాయుడు, సుశీల, కూరంగి గోపీ పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఆదివాసీ జెఎసి ఏర్పాటు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఆదివాసీ రిజర్వేషన్లతో పాటు వారి హక్కుల పరిరక్షణకు జిల్లాలో గల గిరిజన సంఘాలతో కలిసి జెఎసి ఏర్పాటైనట్లు ఎపి షెడ్యూల్ ఏరియా సంఘం, గిరిజన నిరుద్యోగ సంఘం ప్రతినిధులు ఆరిక ప్రభాకర్, సీదరపు రాజు, ఊర్లక నాగార్జున, హిమరక పకీరు తెలిపారు. ఆదివారం స్థానిక గిరిజన భవనంలో వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్రప్రభుత్వం తీసుకున్న బోయ, వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకస్తున్నాయన్నారు. 40లక్షలు జనాభా కలిగిన బోయ, వాల్మీకి తెగలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా అభివృద్ధి చెందారన్నారు. అలాగే 33 తెగల జనాభా కలిగిన రిజర్వేషన్ పొందుతున్న గిరిజనులకు ఇది తీవ్ర అన్యాయం బోయ, వాల్మీకిలు ఇప్పటికి బిసి-ఎగా గుర్తించి వివిధ జిల్లాలో నివసిస్తున్నారని, వారిని తీసుకువచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి తన స్వార్థ రాజకీయాల కోసం ఎస్‌టిల్లో కలుపుతామని తీర్మానించడం గిరిజనులకు తీవ్ర అన్యాయమని అన్నారు. వైసిపి గిరిజన ప్రజా ప్రతినిధులు నిజమైన గిరిజన బిడ్డలైతే తక్షణమే ఆ పార్టీ పదవులకు, పార్టీ సభ్యత్వనికి రాజీనామా చేసి ఆదివాసీ నిరసనలో కలిసి రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు గిరిజనసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న గిరిజన జెఎసి నాయకులు

ఈ మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి, చిట్టిపూడి వలస, కడకల్ల, రేగులపాడు, బడ్లపాడు, పాపంపేట, వండువ తదితర గ్రామాల జంక్షన్ వద్ద గల ప్రధాన మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద ఎటువంటి వేగనిరోధకాలూ లేకపోవడంతో అనేక మంది ప్రమాదానికి గురై మృతి చెందుతున్నారు. మండలం చిదిమి గ్రామ జంక్షన్ వద్ద గతేడాది డిసెంబర్ 23న మండల కేంద్రంలోని దళిత వీధికి చెందిన నత్తల వీరయ్యను గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొని గాయపరిచాడు. ఈ ఏడాది జనవరి 16న విజయనగరం జిల్లా గరివిడిలోని శ్రీ రామన్నపేటకు చెందిన గంట ఎస్తోష్ పాత్రో వీరఘట్టం నుండి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పాపంపేట గ్రామ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వాహనాన్ని అదుపు చేయలేక పక్కన ఉన్న కల్వర్టును ఢీకొని మృతి చెందాడు. అదే నెల 22న శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం ఎరకయ్య పేటకు చెందిన అలుబోయిన మల్లేష్ కుటుంబ సభ్యులతో రాయగడలోనే గౌరమ్మ దర్శనం చేసుకొని టాటా మ్యాజిక్ పై తిరిగి వస్తుండగా బడ్లపాడు గ్రామ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వాహనం ప్రమాదానికి గురై మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యుల వీధిన పడ్డారు.

కానరాని వేగ నిరోధకాలు

రోడ్లు, భవనాల శాఖ అధికారులు మలుపులు వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేయకపోవడంతో మరిన్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చిదిమి, రేగులపాడు, బడ్లపాడు, పాపంపేట వండవ గ్రామాల జంక్షన్‌లలో ప్రధాన మలుపుల వద్ద విజయనగరం జిల్లా రేగిడి ఆముదాలవలస షుగర్ ప్యారిస్ ప్రతినిధులు రాత్రి సమయంలో ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. అవి మూడు రోజులు ముచ్చటకే పని చేసి మూలకు చేరడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరక్కుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చిదిమి వద్ద ప్రమాదకంగా ఉన మలుపు

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన నాయకులు లోకం నాగ మాధవి ప్రారంభించారు. ఈ పోటీలలో మండలంలోని పలు గ్రామాల నుంచి 18 జట్టులు పాల్గొన్నాయి. ఫైనల్స్‌కు చేరిన కొల్లిపేట, భోగాపురం జట్లు మధ్య హోరాహోరీగా పోటీ జరిగి భోగాపురం జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పల్లా రాంబాబు, పలు గ్రామాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ సెక్రటరీగా చిన్నారి

జిల్లా వాలీబాల్ సెక్రటరీగా ఎంపికైన చిన్నారిని, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నాగన్నను ఆదివారం భోగాపురం యువత, గ్రామ పెద్దలు, వాలీబాల్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. వాలీబాల్ క్రీడతో భోగాపురానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు అందించిన ఉపాధ్యాయులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు పిఇటిలు, యువకులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 1050 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏప్రిల్ 3 నుంచి జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలం నుంచి 1050 విద్యార్థులు హాజరవుతున్నట్లు ఎంఇఒ జె.నారాయణస్వామి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భద్రగిరి పిటిజి, ఎపిఆర్ బాలుర పాఠశాల, టిక్కబాయి, రేగిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు తాగునీరు, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. 144 సెక్షన్ నడుమ పరీక్షలు పగడ్బందీగా జరిగేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

ఓపెన్ టెన్త్ పరీక్షలకు 200 మంది

ఓపెన్ టెన్త్ పరీక్షలకు 200మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ఎంఇఒ నారాయణస్వామి చెప్పారు. ఇందుకోసం భద్రగిరి పిటిజి బాలికల పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మధ్యాహ్నం వేళలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

28,31న వంద ద్విచక్ర వాహనాలు వేలం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వంద ద్విచక్ర వాహనాలను, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్‌లో ఈ నెల 28,31న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఉన్నతాధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ఎక్సైజ్‌శాఖ నిర్ణయించిన ధరావత్తు రూ.2వేలు స్టేషన్లో ముందుగా చెల్లించి టోకెన్ తీసుకొని ఈనెల 28, 31 తేదీల్లో స్థానిక స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో జరుగు వేలం పాటకు హాజరు కావాలని ఈ అవకాశాన్ని వేలం పాటదారులు వినియోగించు కావాలని తెలిపారు.